# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-12-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని శంకరగుప్తం డ్రెయిన్ ఆధునికరణ పనులకు ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ ఈ రోజు శంకుస్థాపన చేశారు.**

2. **రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖలో ఈ ఏడాది విప్లవాత్మక మార్పులు తెచ్చామని స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.**

3. **ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా BSNLముందుకు సాగుతోందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.**

4. **రాష్ట్రంలో ప్రస్తుత ఖరీఫ్‌లో మొత్తం 34.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**

5. **వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాష్ట్రంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.**

========================

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునీకరణ పనులకు ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ ఈ రోజు శంకుస్థాపన చేశారు. కోనసీమ కొబ్బరి రైతుల సమస్యల పరిష్కారానికి 20.77 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయం నుంచి దృశ్యమాధ్యమం విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శంకర గుప్తంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక రాజోలు శాసనసభ్యులు దేవ వరప్రసాద్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, జల వనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

--------------------------

రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖల్లో ఈ ఏడాది విప్లవాత్మక మార్పులు తెచ్చామని స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఆమె ఈ రోజు మాట్లాడుతూ, చిన్న అంగన్వాడీలను, ప్రధాన అంగన్వాడీలుగా మార్చామని, అంగన్వాడీలకు సెల్ ఫోన్ సౌకర్యం కల్పించామని చెప్పారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలు లేకుండా రహదారుల సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. తద్వారా గర్భిణులు, అనారోగ్యంతో బాధపడే వారిని ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ఇబ్బందులు ఉండవని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 29 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాజ్య విధానం –లిటిగేషన్ పాలసీ –2025" ను పరిశీలించడానికి ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం నిన్న మొదటిసారిగా రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్,రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్,పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ లు న్యాయశాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ .అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించడానికి, న్యాయ స్థానాల్లో అధిక భారాన్ని నివారించడానికి, పరిపాలనా స్థాయిలో వివిధ పద్ధతులను సమీక్షించి మంత్రుల సంఘం సూచనలు చేస్తుందని తెలిపారు.న్యాయశాఖ ను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు.

--------------------------

ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా BSNL ముందుకు సాగుతోందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, హర్యానా రాష్ట్రాల్లోని BSNL సర్కిళ్ల పనితీరుపై కేంద్రమంత్రి నిన్న ఢిల్లీలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,4G విస్తరణ కారణంగా సేవల్లో మరింత మెరుగుదల కనిపిస్తోందన్నారు.BSNLసేవల్లో ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ సర్కిళ్లు మంచి ఫలితాలు సాధించాయని తెలిపారు.

--------------------------

ప్రపంచ రాజకీయాలలో 2025 సంవత్సరం కేవలం ఒక సాధారణ సంవత్సరం కాదు. ఇది ప్రపంచ వేదికపై భారతదేశం ఎదుగుదలలో ఒక కీలకమైన అధ్యాయం.ఈ ఏడాది కాలంలో ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ప్రపంచంపై చూపిన ప్రభావం గురించి ఆకాశవాణి అందిస్తున్న కథనం..

ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక రాజకీయ సంక్షోభాలలో మారుతున్న అధికార సమీకరణల మధ్య, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంతర్జాతీయ వ్యవహారాలలో ఒక ముఖ్య వ్యక్తిగా మారారు. దేశంలో నిర్ణయాత్మక ఆర్థిక నాయకత్వం నుండి విదేశాలలో ఆత్మవిశ్వాసంతో కూడిన దౌత్యం వరకు, ఆయన చర్యలు ప్రపంచవ్యాప్త దృష్టిని ఆకర్షించాయి.డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం ప్రతీకార సుంకాలను విధించినప్పుడు దేశ ప్రయోజనాలే ప్రధానమని ప్రధానమంత్రి స్థిరంగా నిలబడ్డారు. 2025లో భారత ఆర్థిక వ్యవస్థ 8.2% జీడీపీ వృద్ధిని నమోదు చేసింది. 2025వ సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ మొత్తం 29 అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్నారు. ప్రోటోకాల్‌ను మించి ప్రపంచ దేశాల నాయకులతో వ్యక్తిగత సంబంధాలను కొనసాగించి గ్లోబల్ సౌత్, విస్తృత అంతర్జాతీయ సంబంధాలను తీర్చిదిద్దిన కీలకమైన వ్యక్తిగా నిలిచారు.

--------------------------

రాష్ట్రంలో ప్రస్తుత ఖరీఫ్‌లో మొత్తం 34.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిన్న మాట్లాడుతూ, గతేడాది కంటే ఈ ఖరీఫ్‌లో రైతుల నుంచి ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు

చేశామని తెలిపారు. 5.59 లక్షల మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి వారు నష్టపోకుండా 8,206 కోట్ల రూపాయలను చెల్లించామన్నారు. పల్లె పండగ కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి వివరించారు.

---------------------------

వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాష్ట్రాలలో ఆలయాల్లో రద్దీ నెలకొంది. తెల్లవారుజాము నుంచే భక్తులు శ్రీమహా విష్ణువు దర్శనానికి తరలి వచ్చి ఉత్తర ద్వార దర్శనాలు చేసుకుంటున్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలోఉత్తర ద్వారదర్శనం కోసం భక్తులు పెద్దసంఖ్యలో బారులు తీరారు.పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, అనంతపురం, ప్రకాశం జిల్లాలోని వైష్ణవ పుణ్యక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఇక తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆలయంలో తెల్లవారుజామునే నుంచే ఉత్తర ద్వారం గుండా భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమలలో స్వర్ణరథోత్సవాన్ని నిర్వహించారు. ఉభయదేవేరులతో మలయప్ప స్వామి స్వర్ణరథంపై ఊరేగారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి ఛైర్మెన్ బి. ఆర్ నాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ 26 సెకన్లు

---------------------------

సమర్ధవంతమైన పోలీసింగ్ విధానాలతో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. వార్షిక నేర విశ్లేషణ నివేదికను వివరాలను గుంటూరులో నిన్న పాత్రికేయులకు వివరించారు. 2025లో నేరాల శాతం 13 వరకు తగ్గిందని, రహదారి ప్రమాద మరణాలు 25 శాతం తగ్గాయని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిర్మూలనకు "సంకల్పం" కార్యక్రమం ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలియజేస్తూ,

వాయిస్ 29 సెకన్లు

---------------------------

విశాఖపట్నంలోని తూర్పు నావికాదళంలో 13వ భారత నావికాదళం, భారత తీర రక్షక దళం సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సమావేశానికి తూర్పు నావికాదళ కమాండ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సుశీల్ మీనన్, కోస్ట్ గార్డ్ కమాండర్ ఈస్ట్రన్ సీబోర్డ్ అదనపు డైరెక్టర్ జనరల్ డోనీ మైఖేల్ సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ఇరు దళాలలకు చెందిన ఏరియా కమాండర్లు, సీనియర్ అధికారులు ఈ చర్చలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమైన సముద్ర భద్రతా విషయాలను సమీక్షించడంతో పాటు ఇరు శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించడానికి, ప్రాంతీయ సముద్ర భద్రతను బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలపై చర్చించారు.

---------------------------

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద జనవరి నెలకు సంబంధించిన సామాజిక భద్రత పింఛన్‌లను రాష్ట్ర ప్రభుత్వం రేపు పంపిణీ చేయనుందని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

=====================